పాపన్న ఆశయసాధనకు కృషి చేద్దాం

పెద్దపల్లిరూరల్: సర్వాయి పాపన్న ఆశయాల సాధనకు కృషి చేద్దామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయిపాపన్న జయంతోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఓదెల, కాల్వశ్రీరాంపూర్ జెడ్పీటీసీలు గంట రాములు, తిరుపతిరెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డి, టీఎన్‌జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, మాజీ జెడ్పీటీసీ గోపగాని సారయ్య, వెంకటేశం తదితరులున్నారు.


పాపన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


బాలిక ఇంటి వద్ద కూలీలు (ఫైల్)

గాయాలతోనే బాలిక మృతి?

లైంగికదాడిపై పోలీసులకు లభించని ఆధారాలు

- బాలికను చితకబాదడం వల్లే ఆత్మహత్యాయత్నం!
- చెరువు, పురుగు మందు షాపుల వద్దకు అందుకే వెళ్లిందా?
- గాంధీ ఆస్పత్రి నివేదిక వస్తేనే నిజం తెలిసేది

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన పెద్దపల్లి జిల్లాలో మధ్యప్రదేశ్ బాలిక కేసు మరో మలుపు తిరిగింది. ఆగస్టు 14వ తేదీ రాత్రి బాలికపై సామూహిక లైంగికదాడి జరిగిందని, దాంతో అమ్మాయి అనారోగ్యం పాలై, మరణించిందని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. తాజాగా బాలిక ఒంటిపై గాయాలున్న మాట వాస్తవమే గానీ, లైంగికదాడి జరిగినట్లుగా పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదన్న విషయం సంచలనం రేపుతోంది. ఈ దుర్ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే రామగుండం పోలీసులు స్పందించారు. గోదావరిఖని, పెద్దపల్లి ఏసీపీలు, పెద్దపల్లి డీసీపీలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసిన సీపీ రెమా రాజేశ్వరి కేసును స్వయంగా పర్యవేక్షించారు. అసలు అనారోగ్యంతో ఉన్న బాలికను గుట్టుచప్పుడు కాకుండా ఎందుకు తరలించాల్సి వచ్చింది? వీరికి వాహనం ఎవరు సమకూర్చారు? తనపై కొందరు లైంగికదాడి జరిపారు.. అంటూ బాలిక చెబుతున్న ఆడియోలో వాస్తవమెంత? తదితర విషయాలపై దాదాపు 48 గంటల సుదీర్ఘ సాంకేతిక, శాస్త్రీయ దర్యాప్తు తర్వాత రామగుండం పోలీసులు ఈ మేరకు నిర్ధారణకు వచ్చారని తెలిసింది.

ఇంట్లో వారే కొట్టారా?

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట శివారులోని అక్కాబావల వద్దకు మధ్యప్రదేశ్ నుంచి బాలిక వచ్చింది. ఆమె మరణానికి ముందు ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి. ఇవి ఎవరు చేశారు? అన్నదానిపై స్పష్టత లేదు. బాలికను కుటుంబసభ్యులు లేదా తెలిసినవారే తీవ్రంగా కొట్టారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆరోజు తనను తీవ్రంగా కొట్టడంపై బాలిక మనస్తాపానికి గురైంది. అది తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేసుకోవాలనుకుందేమోనని అనుమానిస్తున్నారు. బాలిక చివరిసారిగా కనిపించిన పరిస్థితులు ఈ వాదనకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఆమె ఆగస్టు 14 మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఇంట్లో లేదు. ఆ సమయంలో ఏం చేసింది? అన్నదానిపై పోలీసులు సీసీ ఫుటేజీ ద్వారా అణువణువూ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో బాలిక పురుగుల మందు షాపుల ముందు, రాత్రి 8 గంటల ప్రాంతంలో సమీపంలోని ఓ చెరువు వద్ద కూడా కనిపించిందని సమాచారం. అర్ధరాత్రి చెరువు వద్ద ఏం చేస్తున్నావని కొందరు మందలించడంతో అక్కడి నుంచి బస్టాండ్ వైపు వెళ్లినట్లు తెలిసింది. ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంది కాబట్టే.. ఈ రెండు ప్రాంతాల్లో కనిపించిందని పోలీసులు భావిస్తున్నారు. ఇంటి నుంచి బస్టాండ్ వద్దకు బాలిక సంచరించిన ప్రాంతాల్లో మొత్తం 15 మంది ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. రాత్రి 11 గంటల తర్వాత ఇంటికి చేరిన బాలిక.. అస్వస్థతకు గురైంది. వెంటనే బాలిక బంధువులు కారు మాట్లాడుకొని, ఆమెను హుటాహుటిన మధ్యప్రదేశ్‌లోని బాల్‌ఘాట్ జిల్లా కజ్రీ గ్రామానికి తరలించారు. మార్గమధ్యలో వాంతులు చేసుకుంది. విషయం తెలుసుకున్న రామగుండం పోలీసులు అక్కడి ఎస్పీని సంప్రదించారు. తొలుత బాలిక మరణించిన విషయాన్ని ధ్రువీకరించుకున్నాక అంత్యక్రియలు జరపకుండా ఆపగలిగారు. అంత్యక్రియలు ఆపేది లేదంటూ ఆమె బంధువులు వాదనకు దిగారు. ఎంతో శ్రమిస్తే గానీ.. వారు దారికి రాలేదు. ఎట్టకేలకు బాలిక మృతదేహానికి అక్కడ స్థానిక ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, తిరిగి సెకండ్ ఒపీనియన్ కోసం గాంధీ ఆస్పత్రికి మరోసారి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.


గాయపరిచింది ఎవరు?

- బాలిక ఒంటిపై గాయాలున్నాయి తప్పితే, లైంగికదాడి జరిగినట్లుగా ఎలాంటి ఆనవాళ్లు లేవని తెలిసింది. మరి ఆమెను మరణించేంత స్థాయిలో గాయపరిచింది ఎవరు? అసలు ఆగస్టు 14 మధ్యాహ్నం ఏం జరిగింది? బాలిక ఎవరితో ఘర్షణ పడింది? ఆమెపై ఎవరు దాడి చేసి ఉంటారు? అన్న విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సామూహిక లైంగికదాడి జరిగిందని ప్రచారం కావడం, అందులోనూ బాధితురాలు మైనర్ కావడంతో విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. అన్ని బృందాల పోలీసులు అత్యంత గోప్యత పాటిస్తున్నారు. ఇంతవరకూ దర్యాప్తు పురోగతిలో ఏ విషయాన్ని మీడియాతో పంచుకోలేదు. ఈ క్రమంలోనే అమ్మాయి మాట్లాడిందని చెబుతున్న ఆడియో విడుదల చేసిన వారిని అదుపులోకి తీసుకొని, ప్రశ్నించినట్లు తెలిసింది. వారు చెప్పే సమాధానాలు పొంతన లేకుండా ఉన్నాయని సమాచారం. గాంధీ ఆస్పత్రి నుంచి నివేదిక వస్తేగానీ.. పోలీసులు ఈ విషయంలో ఎలాంటి ప్రకటన చేసేలా లేరు. ఆ నివేదికలో ఏం ఉంటుందన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

మూగబోయిన శాస్త్రులపల్లి

మంథని: మరో ఉద్యమ కెరటం నేలవాలింది. నాలుగున్నర దశాబ్దాల అజ్ఞాత జీవితానికి తెరపడింది. మారుమూల మంథని గడ్డపై పుట్టి, విప్లవోద్యమాల వైపు ఆకర్శితుడై, చిన్నతనంలోనే పీడిత సమాజం కోసం అడుగులు వేశాడు.. 1975లో మంథనిలో ఇంటర్ చదువుతుండగా రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చేరిన విప్లవకారుడు మల్లా రాజిరెడ్డి ఉరఫ్ మీసాల రాజిరెడ్డి, సంగ్రామ్ ఉరఫ్ సాయన్న, అలోక్, దేశ్ పాండే అలియాస్ గోపన్న అనారోగ్యంతో ఈ నెల 16న మరణించినట్లు వార్తలు రావడంతో ఆయన సహచరులు కన్నీరు పెట్టుకుంటున్నారు. అయితే అటు మావోయిస్టు పార్టీ గానీ ఇటు పోలీసులు, కుటుంబసభ్యులు గానీ ఆయన మృతిని ధ్రువీకరించలేదు. రాజిరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని దండకారణ్యంలో మావోయిస్టు గెరిల్లా దళాలను ఏర్పాటు చేయడంలో కీలక భూమిక పోషించారు. మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ కార్యదర్శి ముప్పాల లక్ష్మణరావుకు సమకాలీకుడిగా పేరున్న రాజిరెడ్డి ఇక లేరన్న వార్త నాలుగు రాష్ట్రాల దండకారణ్య అటవీ ప్రాంతాల్లో విషాదం నింపింది.

- మావోయిస్టు నేత మీసాల రాజిరెడ్డి మృతి?
- అంచలంచెలుగా అగ్రశ్రేణి నాయకుడిగా..
- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కేరళ రాష్ట్రాల్లో తనదైన ముద్ర
- చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్న స్నేహితులు
- కన్నీరు పెట్టుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు


శాస్త్రులపల్లి గ్రామం

కొండపల్లి స్ఫూర్తితో ఉద్యమ బాట

మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధి శాస్త్రులపల్లికి చెందిన మల్లా రాధమ్మ (రాజమ్మ)–వెంకటిరెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు రాజిరెడ్డి, చిన్న కొడుకు భీమారెడ్డి. వీరిది వ్యవసాయ కుటుంబం. 1975లో గ్రామంలో జరిగిన ఓ సంఘటనలో రాజిరెడ్డిపై కేసు నమోదై, జైలుకు వెళ్లాడు. వరంగల్ జైలులో ఉన్న సమయంలో పీపుల్స్‌వార్ వ్యవస్థాపకుడు కొండపల్లి సీతారామయ్య వర్గానికి చెందిన కొంతమందితో పరిచయం ఏర్పడింది. జైలు జీవితం అనంతరం ఆయన కొండపల్లి స్ఫూర్తితో ఉద్యమ బాట పట్టినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

సింగరేణి ఉద్యోగం కాదని..

రాజిరెడ్డితోపాటు ఆయన సోదరుడు భీమారెడ్డికి సింగరేణిలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరాలని తండ్రి వారికి సూచించారు. కానీ రాజిరెడ్డి తనకు వచ్చిన కాల్ లెటర్‌ను చించేసి, విప్లవోద్యమం వైపు వెళ్లాడు. ఆయన సోదరుడు మాత్రం సింగరేణి ఉద్యోగం చేసి, విరమణ పొందాడు.

మేనమామ కూతురితో వివాహం

రాజిరెడ్డి తన మేనమామ రామగిరి(అప్పుడు ముత్తారం) మండలంలోని రామయ్యపల్లికి చెందిన మట్ట కృష్ణారెడ్డి కూతురు రత్నమ్మను వివాహం చేసుకున్నాడు. రాజిరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత పోలీసుల వేధింపులు పెరగడంతో ఆమె సైతం 1982లో పీపుల్స్‌వార్ పార్టీలోకి వెళ్లినట్లు బంధువులు తెలిపారు. అక్కడే వారికి కూతురు స్నేహలత జన్మించడంతో ఆరేళ్ల వయసులో పాపను సోదరుడి చేతిలో పెట్టారు. ఆయన పెంచి పెద్దచేసి, చదివించాడు. తీవ్ర నిర్బంధంలో ఎవరూ రాలేని పరిస్థితిలో మంథనిలోని ఎకరన్నర భూమిని అమ్మి, మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లిలో ఆమెకు కాసీం అనే వ్యక్తితో వివాహం జరిపించారు. స్నేహలత న్యాయవాదిగా పని చేస్తున్నట్లు తెలిసింది. రత్నమ్మ మరణించిన తర్వాత రాజిరెడ్డి అజ్ఞాతంలోనే బీచ సుగుణ ఉరఫ్ సంగీతను వివాహం చేసుకున్నట్లు సమాచారం.

తల్లిదండ్రుల కడసారి చూపునకు రాలే..


రోదిస్తున్న రాజిరెడ్డి మరదలు సరోజన

రాజిరెడ్డి తండ్రి 25 ఏళ్ల క్రితం చనిపోయారు. పోలీస్ నిఘా తీవ్రంగా ఉండటంతో ఆయన తన తండ్రిని కడసారి చూసుకునేందుకు రాలేకపోయారు. తల్లి రాజమ్మ 2013లో అనారోగ్యంతో మృతిచెందగా అప్పుడూ రాలేదు. కానీ రెండు నెలల మాసికం రోజు సమీపంలోని అటవీ ప్రాంతానికి వచ్చి, తన కుటుంబసభ్యులను పిలిపించుకొని మాట్లాడినట్లు విశ్వసనీయ సమాచారం.

రెండుసార్లు అరెస్టు..

31–01–1950లో జన్మించిన మల్లా రాజిరెడ్డి రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో కేంద్ర కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగారు. 1988లో ధర్మపురిలో తొలిసారి, 2007 డిసెంబర్ 14న కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులం పట్టణం ఎస్ఆర్ ప్లాజా వద్ద రెండోసారి అరెస్టయ్యారు. 18 నెలల జైలు జీవితం గడిపిన రాజిరెడ్డి మళ్లీ 2009 అక్టోబర్ 7 అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో ఆయన అనేక సంఘటనల్లో కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం కేంద్ర కమిటీ సభ్యుడిగా, ఆంధ్ర, ఒడిశా బార్డర్ దండకారణ్య సెక్రటరీగా ఉన్నట్లు సమాచారం. రాజిరెడ్డిపై మహదేవపూర్ మండలం అన్నారం అడవుల్లో మాజీ స్పీకర్ శ్రీపాదరావు హత్య కేసుతోపాటు కరీంనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ హత్య కేసు నమోదయ్యాయి. అంతేకాకుండా పెద్దపల్లి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 9, దేశవ్యాప్తంగా 40కి పైగా కేసులు ఉన్నట్లు సమాచారం. ఆయనపై రాష్ట్రంలో రూ.25 లక్షలు, ఆయా రాష్ట్రాల్లో మరో రూ.75 లక్షల నజరానా ఉంది.


మంథని కోర్టులో హాజరుపర్చేందుకు రాజిరెడ్డిని తీసుకొస్తున్న పోలీసులు(ఫైల్)


రాజిరెడ్డి ఇంటి వద్ద గ్రామస్తులు

యాభై ఏళ్ల కింద చూసిన



నేను వయస్సులో ఉన్నప్పుడు రాజిరెడ్డి చిన్నోడు. అన్నలల్లకు పోకముందు మా ఇంటికి వచ్చేటోడు. అందరం కలిసిమెలిసి ఉండేటోళ్లం. యాభై ఏళ్ల కింద పోయిన మనిషి మల్లా రాలేదు నేను చూడలేదు. తల్లిదండ్రులు బాగా బాధపడటోళ్లు.

– నాసారపు లచ్చన్న, శాస్త్రులపల్లి

ఉద్యమంలోకి పోయినంక ఒక్కసారే చూసిన



సింగరేణిల ఉద్యోగం కోసం ఇద్దరికి ఒక్కసారే ఎంప్లాయిమెంట్ కార్డు వచ్చింది. తను చేయనని కార్డు చింపేసిండు. నేను ఉద్యోగం చేసి రిటైర్డ్ అయిన. ప్రజలకు సేవచేస్తనని లోపలికి పోయిన మనిషి అట్లనే ఉన్నడు. నలభై ఏండ్ల తర్వాత చర్లపల్లి జైలులో చూసిన. మా బాపు, అమ్మ చనిపోయినప్పుడూ రాలేదు. అన్న ఆరేళ్ల బిడ్డను తీసుకుపొమ్మని కబురు చేస్తే పోయి తీసుకొచ్చి సాదుకొని పెండ్లి చేసిన. అన్న చనిపోయిండు అంటే నమ్మబుద్ధి కావడం లేదు. మాకు మృతదేహం ఇస్తే మా ఊర్లనే దహన సంస్కారాలు చేసుకుంటాం.

– మల్లా భీమారెడ్డి, రాజిరెడ్డి సోదరుడు

గోదావరిఖనిలో సినిమా చూసినం



మా గ్రామంలో మేమిద్దరమే మంచి స్నేహితులం. ఒకటో తరగతి నుంచి ఐదు దాకా ఇక్క డే చదివి, పదో తరగతి వరకు మంథెన్ల చదివినం. నేను పదో తరగతిల ఫెయిల్ అయిన. రాజిరెడ్డి ఇంటర్‌లో చేరి చదువుకున్నడు. అప్పుడు సైకిల్, బండ్లు లేవు. రోజూ ఇద్దరం నడుచుకుంటా బడికి వెళ్లేది. అప్పుడప్పుడు ఒడి ఎగ్గొట్టి గోదావరిఖనికి నడుచుకుంటూ వెళ్లి సినిమా చూసి వచ్చేది.

– నల్లా శంకరయ్య, సింగరేణి విశ్రాంత ఉద్యోగి, రాజిరెడ్డి క్లాస్‌మేట్, శాస్త్రులపల్లి

దరఖాస్తుల కిక్కు


రాత్రి వేళ వర్షంలో గొడుగులు పట్టుకొని బారులు తీరిన దరఖాస్తుదారులు

- చివరి రోజు భారీగా మద్యం టెండర్లు
- రాత్రి వరకూ బారులు తీరిన దరఖాస్తుదారులు
- 77 దుకాణాలకు 1,450 దరఖాస్తులు
- 21న డ్రా తీయనున్న కలెక్టర్

సాక్షి, పెద్దపల్లి: మద్యం టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసి ప్రభుత్వం 15 రోజులు సమయం ఇవ్వగా, మొదట్లో టెండర్స్ తక్కువగా నమోదయ్యాయి. చివరి రోజు భారీగా టెండర్లు పడటంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. శుక్రవారం ఆఖరి రోజు కావటంతో వర్షం పడుతున్నా లెక్క చేయకుండా అర్ధరాత్రి వరకు లైన్‌లో నిల్చొని వ్యాపారులు మొత్తం 1,450 టెండర్లు దాఖలు చేశారు. జిల్లా కేంద్రంతో పాటు రామగుండం కార్పొరేషన్, మున్సిపాలిటీ, మండల ప్రాంతాల్లోని మద్యం షాపులకు సైతం ఈ సారి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షల చొప్పున ఫీజు ఉన్నా జిల్లాలోని వ్యాపారులు ఎక్కడా తగ్గలేదు. అనేక ఏళ్లుగా ఇదే వ్యాపారంలో ఉన్న పలువురు ప్రముఖులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ప్రాంతంలోని మద్యం షాపు తమకే దక్కాలన్న పట్టుదలతో అనుచరులు, బంధువుల పేర అత్యధికంగా దరఖాస్తులు చేయించారు. పార్లమెంట్, స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు వచ్చే అవకాశం ఉందనే నేపథ్యంలో అనూహ్యంగా గతంలో కంటే ఎక్కువగానే దరఖాస్తులు దాఖలయ్యాయి.

అర్ధరాత్రి వరకు..

మద్యం టెండర్ల ప్రక్రియలో భాగంగా 77 దుకాణాలకు ఈ నెల 8 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనా మొదట్లో స్వల్పంగా టెండర్లు వచ్చాయి. ముందే డీడీలు తీసినవారు సైతం చివరి రోజు ముహూర్తం చూసుకొని పెద్దమొత్తంలో దరఖాస్తు చేశారు. మద్యం వ్యాపారంలో కొన్నేళ్లుగా ఉన్నవారు ఏ షాపులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎక్కడ ఎవరి పేరు మీద బలం ఉంది అని పూజారుల వద్ద జాతకాలు చూయించుకొని చివరి రోజు అర్ధరాత్రి వరకు కౌంటర్ల వద్ద లైన్‌లో నిల్చొని టెండర్లు వేశారు. దరఖాస్తుదారులు, అధికారుల సమక్షంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సోమవారం డ్రా తీయనున్నారు. 77 దుకాణాల్లో గర్రెపల్లి వద్ద భూపతిపూర్ వైన్ షాపునకు అత్యధికంగా దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. రామగుండం పరిధిలో వ్యాపారుల సిండికేట్‌తో తక్కువ టెండర్లు నమోదయ్యాయి.




మంథని/యైటింక్లయిన్‌కాలనీ: శ్రావణ శుక్రవారం సందర్భంగా మంథని మహాలక్ష్మి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే యైటింక్లయిన్‌కాలనీ అల్లూరులోని శ్రీసంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు.

గొప్ప యోధుడు పాపన్న


పాపన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే చందర్

రామగుండం: గొప్ప యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం రామగుండం బైపాస్ రోడ్డు వద్ద ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, అంతర్గాం జెడ్పీటీసీ నారాయణ, సింగం సత్తయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కారెక్కనున్న కౌశిక్‌హరి


మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో కౌశిక్ హరి

గోదావరిఖని(రామగుండం): బీజేపీ నాయకుడు కౌశిక్‌హరి కారెక్కనున్నారు. శుక్రవారం రాత్రి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, విప్ బాల్క సుమన్‌ను హైదరాబాద్‌లో కలిశారు. ఆయన వెంట ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఉన్నారు.

సంపద వనాల సందర్శన


మొక్కలను పరిశీలిస్తున్న నరసింహారావు

ధర్మారం(పెద్దపల్లి): మండలంలోని సాయంపేట, మేడారం గ్రామపంచాయతీ పరిధిలోని ఇరిగేషన్ భూముల్లో పెంచిన సంపద వనాలను శుక్రవారం గ్రామీణాభివృద్ధి రాష్ట్ర ప్రోగ్రాం అధికారి నరసింహారావు సందర్శించారు. రెండు గ్రామాల్లో పెంచిన మొక్కలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.కార్యక్రమంలో అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి స్వాతి, ఏపీడీ సత్యనారాయణ, ఎంపీడీవో జయశీల, క్వాలిటీ కంట్రోల్ అధికారి ఉపేందర్‌రాజు, బీట్ అధికారి స్వాతి పాల్గొన్నారు.

రిమోట్ పనిచేస్తే ప్రాణాలు దక్కేవి

- పదిరోజులుగా పనిచేయని యంత్రం రిమోట్
- ప్రమాదం పొంచి ఉందని తెలిసినా పట్టించుకోని అధికారులు
- బాధిత కుటుంబానికి బాసటగా కార్మిక సంఘాలు


కృష్ణమురారి మృతదేహం


గాయపడిన గోపాల్ చంద్రమండల్

గోదావరిఖని(రామగుండం): పదిరోజులుగా రిమోట్ పనిచేయకున్నా కేబుల్‌తో యంత్రాన్ని పని చేయించడం వల్లే ప్రమాదం జరిగి కార్మికుడి ప్రాణాలు గాల్లో కలిశాయని తోటి కార్మికులు పేర్కొంటున్నారు. సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధి జీడీకే–11గనిలో జరిగిన ప్రమాదంలో కంటిన్యూస్‌మైనర్ ఆపరేటర్ బక్క కృష్ణమురారి మృతిపై కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గనిలోని 3సీమ్‌లో డెవలప్‌మెంట్ ఏరియాలో కంటిన్యూస్‌మైనర్–2 యంత్రం రి మోట్ ఫెయిల్ అయ్యింది. కేబుల్ కనెక్ట్ ద్వారా యంత్రాన్ని నడిపిస్తూ బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు. ఈక్రమంలో గురువారం రాత్రి యంత్రం ఉన్న గోఫ్ ఏరి యా వద్దకు మురారి వెళ్లిన క్రమంలో గని పైకప్పు పెద్ద మొత్తంలో అతడిపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ప్రాంతానికి కొద్ది దూరంలో ఉన్న ఇంజినీర్ గోపాల్‌చంద్రమండల్ గాయాల పా లయ్యాడు. పనిప్రాంతాల్లో వెంటిలేషన్ సరి గా లేదని, రిమోట్ పనిచేయకుంటే వెంటనే పనులు నిలిపివేయాల్సి ఉండగా, బలవంతంగా పనులు చే యించడంతో ప్రమాదం జరిగిందని ఆరోపిస్తున్నారు.

నాయకుల పరామర్శ

గనిప్రమాదంలో మృతి చెందిన కృష్ణమురారి కుటుంబాన్ని ఎమ్మెల్యే కోరుకంటి చందర్, డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పరామర్శించారు. మృతుడి కుటుంబానికి పరిహారం అందించి అన్ని విధాల ఆదుకోవాలని ఐఎన్‌టీయూసీ నేత జనక్‌ప్రసాద్ అన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం

కృష్ణమురారి కుటుంబానికి రూ.90లక్షలు చెల్లించేందుకు ఆ కంపెనీ అంగీకరించినట్లు కార్మిక సంఘాల నాయకులు తుమ్మల రాజారెడ్డి, మెండె శ్రీనివాస్, ఎల్.ప్రకాశ్, బుర్ర తిరుపతి, గండ్ర దామోదర్‌రావు, యాదగిరి సత్తయ్య, శ్యాంసుందర్, ధర్మపురి, సదానందం తెలిపారు. రూ.25లక్షలు కంపెనీ చెల్లించడం, రూ.65లక్షలు ప్రమాద బీమా రూపంలో అందించేందుకు ఒప్పందం కుదిరింది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లిరూరల్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హరితహారం, గృహ లక్ష్మి తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 2.50 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతివారం 100 గొర్రెల యూనిట్లు గ్రౌండింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ పత్రాలు పంపిణీ త్వరగా చేయాలని, జిల్లాలోని 17 ప్రభుత్వ కారుణ్య నియామకాల భర్తీ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. గృహలక్ష్మి పథకం కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీధర్, జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, డీఎఫ్‌ఓ శివయ్య, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డి, ఏఓ శ్రీనివాస్ , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ చిత్రం.. ఓ జ్ఞాపకం

- చరిత్రను సజీవంగా నిలిపేది.. ఎన్నో భావాలను తెలిపేది ఫొటో
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం
- ఉమ్మడి జిల్లాలో ఫొటోగ్రఫీలో రాణిస్తున్న పలువురు మహిళలు

కరీంనగర్ కల్చరల్: ప్రతీ క్షణాన్ని ఒక మధుర జ్ఞాపకంగా చూపించగలిగేది, కాలం గర్భంలో కలిసిన చరిత్రను సజీవంగా నిలిపేది, ఎన్నో జ్ఞాపకాలను ఎప్పటికీ మన కళ్లముందుంచేది ఫొటో. ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫొటోగ్రఫీకే ఉంది. ఈ ఆధునిక కాలంలో దానికి మానవ జీవితంతో విడదీయలేని బంధం ఉంది. రసాయనాలతో రూపొందించిన ప్లేటుపై కాంతిచర్యతో ఓ రూపాన్ని బంధించడాన్ని ఫొటోగ్రఫీ అంటారు. క్లుప్తంగా చెప్పాలంటే కాంతితో చిత్రాన్ని గీయడం. నేడు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలువురు మహిళలు ఫొటోగ్రఫీలో తమ ప్రత్యేకత చాటుకుంటున్నారు.


గోల్డ్ మెడల్‌కు ఎంపికైన ఫొటో

కేదార్‌రెడ్డి ఫొటోకు గోల్డ్ మెడల్


కేదార్‌రెడ్డి

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంతర్జాతీయ స్థాయిలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల ఇంటర్నేషనల్ సిలస్ వారు ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. దేశ, విదేశాల నుంచి 220 మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఇందులో కరీంనగర్‌కు చెందిన సిగ్మా ఫొటో స్టూడియో నిర్వాహకుడు మహిమల కేదార్‌రెడ్డి గోల్డ్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఆయన తీసిన చిన్నారిని ఎత్తుకున్న తల్లి బ్లాక్ అండ్ వైట్ చిత్రం అవార్డు దక్కించుకుంది. ఈ పోటీల్లోనే కలర్ విభాగంలో రిబ్బన్ అవార్డుకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 20న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ స్టేడియంలో అవార్డు అందించనున్నారని, ఈ మేరకు శుక్రవారం సమాచారం అందిందని పేర్కొన్నారు.

నా భర్త దగ్గరే నేర్చుకున్న

– కటుకం స్రవంతి, చైతన్య డిజిటల్ ఫొటో స్టూడియో

నేను కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాలలో 2006లో డిగ్రీ పూర్తి చేశా. 2007లో ఫొటోగ్రాఫర్ సుధాకర్‌తో వివాహం జరిగింది. 2008 నవంబర్ 2న చైతన్య డిజిటల్ ఫొటో స్టూడియో ప్రారంభించాం. నా భర్త దగ్గరే ఫొటోలు తీయడం నేర్చుకున్న. మాకు ఇద్దరు కుమారులు. 2014లో భర్త అనారోగ్యంతో చనిపోయారు. కుటుంబ పోషణకు ఫొటోగ్రాఫర్‌గా మారాను. ఇప్పటివరకు 30 వెడ్డింగ్ ఈవెంట్స్ చేశా. 2023లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అప్పటి కలెక్టర్ కర్ణన్ చేతుల మీదుగా సన్మానం పొందాను.



స్రవంతిని సన్మానిస్తున్న కలెక్టర్ కర్ణన్ (ఫైల్)


అవార్డు అందుకుంటున్న తులసి

ఫొటోలు తీస్తూ.. ఆల్బమ్స్ తయారీ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్ కాలనీకి చెందిన డీవీఆర్ తులసి తండ్రి వెంకటరమణ ప్రోత్సాహంతో ఫొటోగ్రఫీపై మక్కువ పెంచుకుంది. ఆయన డీవీఆర్ పేరుతో ఫొటోస్టూడియో ప్రారంభించగా పెళ్లిళ్లు, పుట్టిన రోజు కార్యక్రమాల్లో ఫొటోలు తీస్తూ ఆల్బమ్స్ తయారు చేస్తోంది. 2020–21లో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి డీకే అరుణ చేతులమీదుగా శ్రీ దాత్రి పురస్కారం అందుకుంది. గతేడాది రాష్ట్రస్థాయి పోటీల్లో బెస్ట్ వెడ్డింగ్ ఫొటోగ్రఫీ అవార్డు గెలుచుకుంది. తెలంగాణ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తోంది.

జమ్మికుంట ఫొటోగ్రాఫర్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న అరుణ్‌కుమార్

జమ్మికుంట: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విజయవాడలో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మికుంట పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ వడ్లూరి అరుణ్‌కుమార్‌కు జాతీయ స్థాయిలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ ఆనర్ అవార్డును ముఖ్య అతిథులు డాక్టర్ జీబీ రావు, ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, మండలి మాజీ ఉప సభాపతి బుద్ధ ప్రసాద్, పార్లమెంట్ మాజీ సభ్యుడు గోకరాజుల చేతులమీదుగా అందజేశారు. ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆయనను అభినందించారు.

భర్త ప్రోత్సాహంతో స్టూడియో


శ్రీలలిత

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని తిరుమల్‌నగర్‌కు చెందిన కాటారపు శ్రీలలిత పదో తరగతి వరకు చదువుకుంది. డిజిటల్ కెమెరాల్లో అద్భుతమైన ఫొటోలు తీస్తోంది. భర్త సంతోష్ టైలరింగ్ పని చేస్తున్నాడు. మొదట్లో ఆయనకు ఆర్థికంగా తోడుగా ఉండేందుకు ఓ ఫొటో ల్యాబ్‌లో రిసెప్షనిస్టుగా ఏడేళ్లు పని చేసింది. రెండేళ్ల క్రితం భర్త, అత్తామామ ప్రోత్సాహంతో రూ.3 లక్షలు అప్పు చేసి, శ్రీలలిత డిజిటల్ స్టూడియో ఏర్పాటు చేసింది. పెళ్లిళ్లు, పుట్టిన రోజు తదితర కార్యక్రమాల్లో ఫొటోలు తీస్తోంది. భర్తతోపాటు మరో ఇద్దరు పేదలకు ఉచితంగా ఫొటోగ్రఫీ నేర్పిస్తోంది.

నాన్న ఆర్టిస్ట్ కావడంతో..


కొండగట్టులో స్రవంతికి సన్మానం (ఫైల్)

కరీంనగర్ కల్చరల్: నాన్న పాశం వరద రాజు ఆర్టిస్ట్. అందు వల్ల నాకు ఫొటోగ్రఫీపై ఇష్టం ఏర్పడింది. నెగెటివ్ ప్రింటింగ్, ఫ్లెక్సీ, రోల్స్ డెవలపింగ్, ఫొటోగ్రాఫిక్స్, ఆల్బమ్ క్రియేషన్ నేర్చుకున్న. నా భర్త శ్రీనివాస్ సపోర్ట్‌తో 2021లో శ్రీలక్ష్మీగణపతి స్టూడియో ప్రారంభించా. మాకు ఇద్దరు అబ్బాయిలు. 2022లో జీఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ వారు కొండగట్టులో నన్ను సన్మానించారు. ప్రస్తుతం ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మహిళా విభాగం కరీంనగర్ పట్టణ జాయింట్ సెక్రటరీగా ఉన్నాను.

– గాలిపెల్లి స్రవంతి,
శ్రీలక్ష్మీగణపతి డిజిటల్ ఫొటో స్టూడియో

ఎల్లలు దాటిన నాన్నమ్మ ఫొటో


మమత


మమత తీసిన ఫొటో

సిరిసిల్లకల్చరల్: కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం బంకెపల్లికి చెందిన గుగులోతు మమత తంగళ్లపల్లి గిరిజన సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో ఫ్యాషన్ టెక్నాలజీ డిగ్రీ చదువుతోంది. ఆమెకున్న ఫొటోగ్రఫీ అభిరుచిని తండ్రి భీమానాయక్ ప్రోత్సహించారు. మమత తీసిన సంప్రదాయ దుస్తుల్లో ఉన్న తన నాన్నమ్మ ఫొటో ఇటీవల అంతర్జాతీయ ఫొటో మ్యాగజైన్ వోగ్ ఇటాలియా ముఖచిత్రంగా ముద్రితమైంది. దీంతో మంత్రి కేటీఆర్ ఆమెను ట్విట్టర్ వేదికగా ప్రశంసించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి జ్ఞాపిక అందజేసి, అభినందించారు.

1,200కు పైగా లఘుచిత్రాలకు కెమెరాఉమెన్


ఈ మొగుళ్లు మాకొద్దు లఘుచిత్రంలోని స్టిల్


అనితారాజ్

విద్యానగర్(కరీంనగర్): చొప్పదండికి చెందిన అనితారాజ్‌కు ఫొటోగ్రఫీపై మక్కువ. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ షార్ట్ ఫిల్మ్ కెమెరాఉమెన్‌గా తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అద్భుత చిత్రాలను అందిస్తోంది. ఏఆర్ఎస్ క్రియేషన్స్ యూట్యూబ్ చానల్ స్టోరీ రైటర్‌గా, డైరెక్టర్‌గా, ఎడిటర్‌గా చేస్తోంది. ఇప్పటివరకు 1200కు పైగా లఘుచిత్రాలకు కెమెరాఉమెన్‌గా పని చేసింది. ఉత్తమ కెమెరాఉమెన్‌గా పలు సంస్థల నుంచి అవార్డులు అందుకుంది. ఈ మొగుళ్లు మాకొద్దు లఘుచిత్రంలోని స్టిల్‌కు రాష్ట్రస్థాయి అవార్డు వచ్చింది.

క్లుప్తంగా

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే చందర్


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చందర్

గోదావరిఖని(రామగుండం): మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సిరిసిల్ల పర్యటనలో ఉన్న మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి రూ.50కోట్లు కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు తదితర నాయకులున్నారు.

సింగరేణి కార్మికులకు రుణపడి ఉంటా

- మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ

గోదావరిఖని: రాజకీయాల్లోకి వచ్చినప్పుడు తనను ఆదరించి, గెలిపించింది సింగరేణి కార్మికులేనని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆర్జీ–2 ఏరియాలోని వకీల్‌పల్లి గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మికులు పలు సమస్యలు విన్నవించారు. అనంతరం మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులకు రుణపడి ఉంటానన్నారు. తాను ఎమ్మెల్యేగా ఈ ప్రాంతానికి ఎంతో చేశానని తెలిపారు. కానీ ఇప్పుడున్న పాలకులు ఏదైనా సహకారం కోరితే లంచాలు తీసుకుంటున్నారని, ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.45 కోట్లు వసూలు చేశారని పేర్కొన్నారు. సింగరేణిని ప్రైవేటుపరం చేస్తున్నారని తమ పార్టీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, దీన్ని నమ్మవద్దని కోరారు. తనను గెలిపిస్తే ఇన్‌కంట్యాక్స్ విషయంలో న్యాయం జరిగేలా చూస్తానన్నారు. నాయకులు వీరన్న, పిడుగు కృష్ణ, వెంకటస్వామి, మంచికట్ల భిక్షపతి, సోమారపు లావణ్య, కోదాటి ప్రవీణ్, బద్రి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–2 జీఎంగా సూర్యనారాయణ



గోదావరిఖని(రామగుండం): ఆర్జీ–2 జీఎంగా ఎల్‌వీ సూర్యనారాయణను యాజమాన్యం నియమించింది. కార్పొరేట్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ జీఎంగా పనిచేస్తున్న సూర్యనారాయణను ఆర్జీ–2కు బదిలీ చేశారు. ఆర్జీ–2 జీఎంగా పనిచేసిన ఎ.మనోహర్‌ను మందమర్రి జీఎంగా బదిలీ చేశారు. అక్కడ జీఎంగా పనిచేస్తున్న గుండా మోహన్‌రెడ్డిని కార్పొరేట్ కాంట్రాక్టు మేనేజ్‌మెంట్ జీఎంగా పంపించారు. బదిలీ అయిన స్థానాల్లో వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశించారు.

డీఎస్పీకి సన్మానం


డీఎస్పీని సన్మానిస్తున్న మహేశ్

రామగుండం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పదేళ్ల క్రితం ఎస్సైగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లి డీఎస్పీగా పదోన్నతి పొందిన భీంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తన బంధువుల ఇంట్లో శుభకార్యానికి కుటుంబసభ్యులతో హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ ఆయనను శాలువాతో సత్కరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దకల్వల గ్రామానికి చెందిన పెగడ అజయ్(21) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. అజయ్ తాను ప్రేమించిన యువతి నిరాకరించిందని మనస్తాపం చెందాడు. ఈ నెల 15న క్రిమిసంహార మందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

159 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సుల్తానాబాద్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వరుణ్, తహసీల్దార్ దినేశ్‌రెడ్డిల వివరాల ప్రకారం.. శుక్రవారం హుజూరాబాద్ నుంచి వ్యాన్‌లో మహారాష్ట్రకు తరలిస్తున్న 159 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సుల్తానాబాద్ మండలంలోని దుబ్బపల్లి శివారు రాజీవ్ రహదారిపై అధికారులు పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి, స్థానిక పోలీసులకు అప్పగించారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలుశిక్ష

గోదావరిఖని/గోదావరిఖనిటౌన్: మద్యం తాగి, వాహనం నడిపిన ఆరిఫ్‌పాషాకు ఐదురోజుల జైలుశిక్ష పడిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అతన్ని శుక్రవారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేశ్ ఎదుట హాజరుపరుచగా శిక్ష విధించారన్నారు. భవిష్యతులో ఇలా చేస్తే జైలుశిక్షకాలం పెంచి, లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించినట్లు సీఐ పేర్కొన్నారు.

గని ప్రమాదంపై విచారణ జరపాలి

పెద్దపల్లిరూరల్: సింగరేణి 11ఏ గనిలో ప్రమాదంపై బీజీఎంఎస్‌తో విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి సునీల్ డిమాండ్ చేశారు. మిషన్‌మైనింగ్ పేరుతో ప్రైవేట్ యంత్రాలకు అవకాశం ఇస్తున్న అధికారులు రక్షణ చర్యలపై దృష్టిసారించడం లేదన్నారు. ఆపరేటర్ కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించాలన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సింగరేణి డైరెక్టర్(పా)

- భూ సేకరణ, అనుమతులపై చర్చ


కలెక్టర్‌తో సమావేశమైన డైరెక్టర్(పా), జీఎంలు

గోదావరిఖని: సింగరేణి డైరెక్టర్(పా) ఎస్.బలరాం శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. రామగుండం రీజియన్‌కు సంబంధించి భూ సేకరణ, భూ అనుమతులు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ తదితర అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. ఆర్జీ–1, 2, 3 ఏరియాల్లో అత్యవసరంగా పూర్తి చేయాల్సిన పనులు, బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. చందనపూర్ ఎస్సీ కాలనీకి సంబంధించిన ల్యాండ్స్, జీడీకే కోల్‌మైన్‌కు సంబంధించిన భూ అనుమతులు, భూ సేకరణ తదితరాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వీటికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు, ఎస్టేట్ జీఎం సురేశ్, ఎస్టేట్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, సీనియర్ ఎస్టేట్ అధికారులు సునీత, ఐలయ్య, సర్వే అధికారి ప్రభాకర్, జైనులాబద్దీన్ తదితరులున్నారు.

11వ వేతన ఒప్పందం అమలు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికులకు 11వ వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.విశ్వనాథ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్జీ–2 డీజీఎం పర్సనల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. 11వ వేతన ఒప్పందం ప్రకారం ఏరియర్స్‌ను ఆగస్టు నెల జీతాలతో కలిపి చెల్లించాలన్నారు. 2023 ఆర్థిక సంవత్సరం లాభాల్లో 35 శాతం వాటాను కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం సింగరేణి కార్మికుల మారుపేర్ల మార్పు, వయోపరిమితి 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచాలన్నారు. 190 మస్టర్లు నిండిన కార్మికులకు జనరల్ మజ్దూర్‌గా పదోన్నతిని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, రాజేందర్, ప్రసాద్, సంపత్, మురళి, అశోక్, కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజ్‌ల ప్రాతినిధ్యం కోసం పోరాడుదాం'

ఎలిగేడు: ముదిరాజ్‌లకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కోసం కొట్లాడుదామని మత్స్యపారిశ్రామిక సంఘం చైర్మన్ కొలిపాక నర్సయ్య, పెద్దపల్లి కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎలిగేడు మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ముదిరాజ్ నాయకులు సన్మానించారు. అనంతరం పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. వాటిని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధిక శాతం ఉన్న ముదిరాజ్‌లకు రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించాలన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో బీసీ కులాలను ఏకం చేసి, ముదిరాజ్ అభ్యర్థి విజయం సాధించేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లా డైరెక్టర్ సబ్బు మల్లయ్య, ఉప సర్పంచ్ సబ్బు శ్రీధర్, ఎంపీటీసీ తూడి లక్ష్మీమురళి, ముదిరాజ్ మహాసభ ఎలిగేడు మండల అధ్యక్షుడు రాయనవేణి శ్రీనివాస్, నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

'ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులు శ్రమజీవులు'


మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులు శ్రమజీవులని, వారికి రానున్న రోజుల్లో మెరుగైన అలవెన్సు ఒప్పందానికి ఐఎన్టీయూసీ కృషి చేస్తుందని ఎన్టీపీసీ ఎన్‌సీసీ సభ్యుడు, యూనియన్ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా అన్నారు. శుక్రవారం రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మికుల వేతన ఒప్పంద కాలపరిమితి ముగిసి ఏడాది కావస్తున్నా చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక సంఘాలు ప్రాతినిధ్య ఎన్నికలు నిర్వహించుకోవాలని, విజయం సాధించిన యూనియన్ యాజమాన్యంతో మాట్లాడే అవకాశం ఉంటుందని తెలిపారు. వారసత్వ ఉద్యోగాలను కార్మిక కుటుంబాలు వినియోగించుకోవాలని సూచించారు. గేట్ పాస్‌లను పునరుద్ధరించి, కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారి కనకయ్య, భూమల్ల చందర్, బొద్దున రాజేశం, వివిధ సంఘాల నాయకులు చింతల సత్యం, జమీల్, గణపతి, సమ్మిరెడ్డి, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

మధుకర్ హత్యపై విచారణ జరపాలి


మాట్లాడుతున్న మధుకర్ తల్లి లక్ష్మి

పంజగుట్ట(హైదరాబాద్): ముఖ్యమంత్రి కేసీఆర్ కేవలం పేపర్లలోనే దళితుల ప్రగతి అని ప్రచారం చేసుకుంటాడు కానీ చేతల్లో ఏమీ చేయడని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆరోపించారు. అగ్రకులం అమ్మాయిని ప్రేమించాడని 2017లో పెద్దపల్లి జిల్లా, మంథనిలో మంథని మధుకర్ అనే దళితున్ని మర్మాంగాలు కోసి హత్యచేసి ఏడు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటివరకు నిందితులకు శిక్ష విధించకపోవడంతో ముఖ్యమంత్రికి దళితులపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంథని మధుకర్ తల్లి మంథని లక్ష్మితో కలిసి మాట్లాడారు. తన కొడుకును ఇంట్లో నుంచి ఎవరు తీసుకెళ్లారు, ఎవరు హత్య చేసి ఉంటారు అని అందరి పేర్లు పోలీస్ స్టేషన్‌లో చెప్పినా ఏ ఒక్కరినీ కనీసం విచారణ కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్లు ఇది ముమ్మాటికీ హత్యే అని చెప్పినా పోలీసులు కనీసం హత్య కేసు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హంతకుల కులానికి చెందిన వ్యక్తే స్థానిక ప్రజా ప్రతినిధి ఉండటం వల్ల పోలీసులు కనీసం కేసు విషయమై పట్టించుకోలేదని ఆవేదన చెందారు. నిందితులను కాపాడుతున్న వారు ఎంతటి పెద్దవారైనా వెంటనే చర్యలు తీసుకోవాలని, ఈ కేసును డీజీపీ స్థాయి అధికారిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్, జై భీమ్ సైనిక్ దళ్ కన్వీనర్ అసాది పురుషోత్తం, బ్యాగరి వెంకటస్వామి, నాయకోటి రవికాంత్, రెడ్డిమల్ల కృష్ణ, శంకర్‌బాబు, గీస రాజు, సాంబ పాల్గొన్నారు.